# ఒ కే దా రి

ఏమైనాసరే! ఇక లాభంలేదు. ఇవాళనుంచీ తను పూర్తిగా మారిపోవాలని చిదంబరం నిశ్చయించుకున్నాడు. రోజూ అందరికంటే పదినిమిషాలు ముందరగా వచ్చేవాడు. ఇవాళ బుద్ధిపూర్వకంగా అయిదునిమిషాలు ఆలశ్యం చేశాడు. రోజూ అంతా వెళ్ళినతరవాతకూడా కుర్చీకి అంటుకునిపోయి కూచుని ఆఫీసుఫైళ్ళని విడవలేక చీకటిపడ్డాక వియోగభారం మోస్తున్నవాడిలాగా ఇంటిదారి పట్టేవాడు. ఆఫీసులో వున్నంతసేపు పనిలోనే సతమతమైపోతూ, క్షణం వ్యర్థమైతే ఎంతో బాధపడేవాడు. నెలాఖరున వచ్చే చాలీచాలని జీతపురాళ్ళు ఎల్లాగో వచ్చితీరుతయ్యని నిర్లక్ష్యంతో వాళ్ళు దాచుకోటం అతను ఎన్నడూ ఎరగడు. ఆఫీసుపని అంటే చిదంబరానికి ప్రాణంతో సమానం. శెలవురోజుల్లోకూడా కుర్చీలో కూచుని దస్తరంవిప్పితేగాని అతనికి తోచేదికాదు. ఇంతకరెక్టు మనిషి పక్కన పనిచెయ్యటం ఇతరగుమాస్తాలకి కంటకంగా వుండేది.

అంతేకాదు, ఈ పాతికేళ్ళ ఉద్యోగంలోనూ చిదంబరం బల్లకింద చెయ్యిజాపిఎరగడు. ఎవరైనా సంతోషసూచకంగా బహుమతికాని, మామూలుకాని ఇవ్వవచ్చినా పుచ్చుకొనేవాడుకాదు. "తనకి తినటం చేతకాదు, సరికదా ఇంకోళ్ళు తింటే తనకేం?" అని తోటిగుమాస్తాలు పళ్ళు పటపటా కొరికేవాళ్ళు.

తన ఇరవై అయిదోఏట ఈ నౌకరిలో మొదట చిదంబరం ప్రవేశించాడు. ఇప్పుడు ఏభయ్యోపడిలో పడ్డాడు. ఒక్క అధికారిచేతకూడా మాట పడలేదు. ఎవరూ వేలెత్తి అతనిలో ఫలానాలోపం వుందని చూపలేరు.

కాని ఇవాళపొద్దున భార్య "మీ నిజాయితే గొప్ప లోపం!" అంది "ముక్కుకిసూటిగా పోయినవాళ్ళు ఎవరు బాగుపడ్డారు? మీ నిజాయితీనిమెచ్చి మీకేమైనా వొరగబెట్టారా?" అంటూ వంకరదారుల్లో నడిచినా ఇళ్లు వాకిళ్ళు, నగలూ నాణెలూ సంపాయించుకున్న ప్రయోజకులందరిపేర్లూ ఏకరువు పెట్టింది. రాజమార్గంలో నడిచి అదృష్టాన్ని అందుకోవాలంటే ఒక జీవితకాలం చాలదేమోననిపిస్తుంది. అడ్డదారులు కనిపెట్టి అమాంతంగా అదృష్టాన్ని చెదరక వుంచుకున్నవాడే ఘనుడు. కాకపోతే ఎల్లకాలం గొర్రెతోక బెత్తెడే అన్న చందం, సంపాదనతో ఏటా పెరిగిపోతున్న సంసారభారం ఎల్లా మోయటం?

భార్యమాట ఈ చెవితోవిని ఆ చెవితో వదిలెయ్యటమే చిదంబరానికి అలవాటు. నెత్తిననోరుపెట్టుకుని చెవులో ఇల్లు కట్టుకుని-సంపాయించండి, అందరు నడిచేదారినే మీరూ తొక్కండి, ఎంత గోడిల్లినా ఖాతరు చెయ్యలేదు. అనీ అనీ విసుగొచ్చి "మీతో వాగినా, ఆ గోడతో వాగినా ఒకటే!" అని కోపంగా వెళ్ళిపోయేది. కాని ఇవాళ భార్యమాటల్లో కూడా ఏదో సత్యమున్నట్లుగా చిదంబరానికి హఠాత్తుగా స్ఫురించింది. మనస్సుని ఏదో కొరడాతో ఫెళ్ళున చరిచినట్లనిపించింది. హఠాత్తుగా భూకంపం వచ్చి హృదయంలో ఏళ్ళ

తరబడి కట్టుకుంటూ వచ్చిన శిఖరాలన్నీ బదాబదలై నేల కూలిపోయినట్లనిపించింది.

"పండక్కి కొత్తబట్టలు కొనవా నాన్నా ?" అంటూ చిన్నకొడుకు.

"జీతం కట్టకపోతే పేరు కొట్టేశారు. పరీక్షకి వెళ్ళనివ్వరు నాన్నా" అంటూ పెద్దకొడుకు.

"ఈడొచ్చిన పిల్లని గుండెలమీద కుంపటెల్లాగా ఎంత కాలం పెళ్ళీ పేరంటం లేకుండా అట్టేపెట్టుకుంటామండీ ?" అని భార్య.

లివరు జబ్బుతో గుడ్డ వుయ్యాలలో చంటిపిల్లాడి ఏడుపు వినబడుతోంది.

ఎదురుగా నూనెగానుగకి కట్టిన ఎద్దు కనబడింది. కళ్ళకి గంతలు కట్టుకుని గిరగిరతిరుగుతోంది. కిర్రుమని గానుగ మూలుగుతోంది. ఆ మోత తన హృదయంలోంచే వస్తున్న దేమోననిపించి కంపించాడు.

త్రుళ్ళిపడి లేచాడు. తూలిపోయి చాపమీద చతికిల పడి లేచాడు మళ్ళీ. "ఇదిగో, కాంతం, ఒకసారి ఇల్లారా" అని కేక వేశాడు.

"ఇంకా వంటకాలేదు. తొక్కులాటగావుంది" అంటూ వంటగదిలోంచి సూటిగావచ్చింది భార్య.

"అయితే నన్నిప్పుడే చెయ్యమంటావ్?" అని చిదంబరం అడిగేసరికి బిత్తరపోతూ "నేనేమన్నానండీ? మీరేగా పెద్ద పని మునిగి పోయినట్లు కేకవేశారు?" అంది కాంతం చిరాకుగా చేతులో గరిటె ఆడిస్తూ.

"నేను మీ కోరికలన్నీ తీరుస్తాను, కావలసినవన్నీ తెస్తాను. ఎల్లకాలం మిమ్మల్ని కష్టాలలో అట్టే పెట్టటం నాకు మటుకు ముచ్చటనుకున్నావా? కాని నన్నిప్పుడే చెయ్యమంటావ్?"

"భోజనంచేసి ఆఫీసుకి దయచెయ్యమంటాను?" అంటూ లోపలికి పోబోయింది.

"కాదు. అందరు తొక్కే దారినే పొమ్మంటావా? ప్రమాదమేమీ రాదుకదా?"

"నలుగురితో పాటు నారాయణా. ఎవరికీరాని ప్రమాదం మీ కే ఎదురుగా వస్తుందా యేమిటి? అన్నిటికీ ఇంత మీన మేషాలూ లెక్కపెట్టి, ఇంత తర్జన భర్జనలు చేస్తారు. కనకనే మనగతి ఇల్లా పట్టింది" "అయితే భయం లేదంటావ్"

"భయంవుంటే తెల్లారిలేస్తే ఇన్నిపనులెల్లా జరుగుతున్న య్యండీ? మీ నీడనిచూసే మీరు ఉలిక్కిపడతారు. మీ నిజాయితీయే మన కొంపకి ఇంత ముప్పుతెచ్చింది" అంది కాంతం కోపంగా వంటింట్లోకి వెళ్ళిపోతూ.

"అవును! ఇంతకాలం నా నీడనుచూసే నేను బెదిరి పోయాను. ఇక భయంతో పనిలేదు. ఇంతకాలం ఉరిపి కట్టే లాగా నేనొక్కడినే ఈ దారిన నడిచాను. ఇక లాభంలేదు. ఇవాళ నేక కొత్త చిదంబరాన్ని ఇవాళనించీ నన్ను ఎవరూ గుర్తుపట్టలేకుండా మారిపోతాను." అనుకుంటూ ఆఫీసుకి బయలు దేరాడు.

రోజూ చొక్కా ఉత్తరీయంతో వచ్చేవాడు. ఇవాళ పెట్టెఅడుగున ఎన్నో ఏళ్ళు కలరావుండలతో సహవాసం

చేసిన వులెన్ పాతకోటు తొడుక్కొని ప్రత్యక్షమయ్యేసరికి అంతా ఆశ్చర్యపోయారు. ఆ కోటు తయారైన కాలంలో ఫాషన్ ప్రకారం తళతళ మెరిసే రోలుగోల్డు గుండీలు చిమ్మెటలు పడేసిన తూట్లతో సరసాలాడుతున్నాయ్. "ఏదో విశేషంవుంది?" అని ఆఫీసులో ప్రతిమనిషీ అనుకున్నాడు.

ఆనాడు చిదంబరం కలంచెవులో దోపి కళ్ళజోడుతీసి బల్లమీదపెట్టి తాపీగా కూచున్నాడు. కొలనులో ఒంటికాలిమీద చేపలకోసం జపంచేసే కొంగలాగా కళ్లుమూస్తూ తెరుస్తూ కూచున్నాడు. పనిచేస్తున్నట్లు కనబడడానికి ఫైలు విప్పి బల్లమీదపరిచి గడియారం కేసి చూస్తూ కూచున్నాడు.

సాయంకాలం అయిదు కొట్టేసరికి టంచన్‌గా కుర్చీలోంచి లేచాడు. ఇంటికి వెళ్ళకుండా సూటిగా బజారుకి నడిచాడు. తనకి కొత్త పంచలూ, చొక్కాలూ, భార్యకీ కూతురికీ చెరొక జరీచీరే, కుర్రాళ్ళందరికీ రెడీమేడ్ లాగూ చొక్కాలూ, బిళ్లలూ, మిఠాయిలూ, మల్లెపువ్వులూ, గుమ్మంముందు. ఇంత సరంజామాతో చిదంబరం సైకిల్ రిక్షాలోంచి దిగేసరికి భార్య ఒక్కగంతువేసి పరిగెత్తుకొచ్చింది. పిల్లలు తేనెటీగల్లాగా ముసురుకున్నారు. ఎప్పుడూ మేఘాలతో మూసుకుపోయివుండే పెద్ద కూతురు ముఖంలో కూడా సంతోషం మెరుపులాగా తలుక్కుమనటం చూసి "అమ్మయ్యా." అనుకున్నాడు చిదంబరం. గ్రీష్మకాలపు చంద్రనిప్పులని చెరిగిపోసే కాంతం కళ్ళలో శరత్కాలపు చలువ వెన్నెల కురవటంచూసి మురిసిపోయాడు. ఇన్నాళ్ళకి జీవితంలో ఒక ఘనకార్యం సాధించినట్లు గర్వంతో అతని హృదయం

చిందులు వేసింది. ఇన్నాళ్ళకి తనూ ఒక మనిషిగా తన వాళ్ళ కళ్ళకి కనిపించగలిగి నందుకు చిదంబరం మురిసి పోతున్నాడు. లోకమంతా నందనవనంగా వికసించి కళ్ళని మిరిమిట్లుగొలుపు తోంది. ఇల్లంతా లక్ష్మీదేవి కాలి బంగరు గజ్జెల ఘలఘలతో మోగిపోతోంది. ఇంతకాలం జీవితంలో చేతికి అందకుండా పారిపోతున్న ఆనందానుభవం ఆనాడు ఆ ఒక్కరాత్రి చిదంబ రాన్ని వరించి మెళ్లో పూలమాల వేసింది. తెల్లవార్లూ ఆకా శాన్ని అంటే మంచుకొండల శిఖరాలమీద సెలయేరు లాగా చిందులువేస్తున్నట్లు, ఇంద్ర ధనుస్సు రెక్కలు విప్పిన నెమిలి లాగా గంతులు వేస్తున్నట్లు, చిరుగాలిలో తెరచాపలెత్తిన తెరమబ్బుల పడవలాగా సుదూర దిగంచలాలకి తేలిపోతున్నట్లు ఒకటే ఆలాపన: ఒకటే కలవరింతలు: గుమాస్తా బతుకు గతు కుల్లో కుదుపుతూ చేమలాగా నడిచే జీవిత శకటం గాలిగుఱ్ఱా లతో గగనపథాన పరిగెత్తిపోతున్నట్లు కలలుకన్నాడు. కాం తంలో ఏళ్ళతరబడిగా అణగారిపోయిన అనురాగం మాధుర్యం ఆజ్యధారకి మేల్కొన్న అగ్నిశిఖలాగా ఒక్కసారి పైకెగసి చిదంబరాన్ని ఆనంద సామ్రాజ్యానికి లేవనెత్తినాయ్. జీవ చ్ఛవంలాగా ఈ పాతికేళ్లూ కొడిబారిన పత్తిలాగా వెలుగుతున్న చిదంబరం ఆ ఒక్కరోజు కానుక ఒక్కరాత్రి ఒకమహాజ్యోతి లాగా ప్రజ్వలించాడు.

తెల్లవారి ఎండ మొహంమీద సూదులతో పొడిచే దాకా చిదంబరం కళ్లు తెరవలేదు. "అయ్యగారు అర్జంటుగా మిమ్మల్ని పిలుచుకురమ్మన్నారు!" అని ఆఫీసు బంట్రోతు ప్రత్యక్షమయేసరికి చిదంబరం బెదిరిపోయాడు. రోజూ చూసే

నౌకరు నారాయుడే అయినా యమదూతలాగా కళ్ళకి కని పించి చేతులతో కళ్ళు నలుపుకున్నాడు. "వస్తున్నా పద" అని నూతిలోకి పడిపోయిన మనిషి అట్టడుగునించి అరిచినట్లు అన్నాడు.

"ఎందుకండీ అల్లా ఖంగారు పడతారూ ? కాస్త కాఫీ తాగి వెళ్ళవచ్చులెండి" అంటూ కాంతం కేకవేసింది.

కాఫీ తాగుతున్నాడే కాని చిదంబరం చాలా పర ధ్యానంగా వున్నాడు. రాత్రి అనుభవించిన ఆనందం, నిన్నటి రోజంతా జీవితంలో వెల్లివిరిసిన సుఖం గుర్తుకొచ్చి అతని మనస్సు కలవరపడుతోంది. ఏవో గాలిమేడల్లో కాపురం చేసి నట్లనిపించి, ఏదో ఎత్తైన శిఖరాలమీదినించి లోతు తెలియని పాతాళకూపంలోకి జారిపోతానా అని బెదిరిపోతోంది చిదంబరం మనస్సు.

అంతా కలలాగా వుంది. అవుననీ, కాదనీ పెదవి కదప కుండా అంతా వింటున్నాడు. అతిముఖ్యమైన దస్తావేజు అక స్మాత్తుగా మాయమైపోయింది. ఆఫీసు రికార్డంతా చిదంబరం ఆధీనంలో ఉంటుంది. కనక అతనికి తెలీయకుండా అది పోవ టానికి వీలులేదు.

"నాకు తెలియదు, నేనెరుగను" అని కొంచెం సేపు బుకాయించాడు.

"లాభంలేదు. ఆ కాగితం తెచ్చితీరాలి. లేకపోతే నీ వుద్యోగం వూడిపోవటమే కాక..." అంటూ ఎర్రటి కళ్ళతో కరుకు కంఠంతో అధికారి నిప్పులు కురిపించాడు.

"సాయంకాలం లోగా తెస్తాను. శలవివ్వండి." అని విన్నవించుకుని తూనీగలాగా దూసుకుపోయాడు చిదంబరం.

అర్థరాత్రివేళ ఇంటికి చేరుకుని ఎవరినీ లేపకుండా తెల్ల వారు ఝామునే లేచి మళ్లీ బయలుదేరాడు. తెలియకుండా కాళ్ళు స్టేషనుకి నడిచినయ్. ఎటువైపుగా వెళ్ళేరైలు కదులు తోంది. అప్రయత్నంగా అందులో ఎక్కబోయాడు. బలమైన హస్తమొకటి అతని లెక్క పుచ్చుకుని కిందికి గుంజింది. ముఖాన నెత్తురుచుక్కలేదు. ఎర్రటోపీ, లాఠీ నిలువునా నీరయి పోయి చిదంబరం తలవంచుకుని వెంట నడిచాడు.

ఆఫీసులో అంతా అప్పటికే వచ్చి కూర్చున్నారు. నడి బజారులో నగ్నంగా నిలబెట్టినంత సిగ్గులో చిదంబరం వంచిన తల ఎత్తలేదు.

"ఏభై వేల దస్తావేజు, ఎదుటి పక్షంవాళ్ళకి దొరికితే కొంప మునిగిపోతుందని నీకు తెలియదా ?" అని అధికారి గర్జించాడు.

"తెలుసు—" అని గొణిగినట్లుగా సన్నగా అన్నాడు చిదంబరం.

"తెలిసే గడ్డితిన్నదన్నమాట. వందరూపాయలకోసం కక్కుర్తిపడ్డావన్నమాట."

"అవును !"

"ఆకాగితం కోసంవచ్చిన మనిషి పేరేమిటో చెప్ప గలవా ? గుర్తుపట్టగలవా?"

"నిన్నరోజంతా గాలించినా దొరకలేదండి" అని దీనంగా విన్నవించాడు.

"ఎల్లా దొరుకుతాడు; ఎక్కడ దొరుకుతాడు? ఎన్నడూ లేని దుర్బుద్ధి ఎందుకుపుట్టింది నీకు ?" అని ఒక్కొక్క ప్రశ్న వేస్తుంటే శూలంతో గుచ్చినట్లుగా గిలగిల తన్నుకుంటున్నాడు చిదంబరం.

"మారువేషంతో నేనే ఆదస్తావేజు కోసం నీదగ్గరకు వచ్చాను. నీకు లంచంఇచ్చిన వందరూపాయల నోటుమీద నాసంతకం కూడా ఉంది. పాపం నువ్వు అదికూడా చూచుకో లేదు కాబోలు ?అని నవ్వుతూ అధికారి అన్నాడు. చిదంబరం కళ్లు తిరిగి కిందపడి పోతానా అనిపించింది. గోడకి ఆనుకుని గడియారంకేసి చూశాడు. అతను ఆఫీసులో చేరిన రోజే ఆ గడియారం అక్కడి గోడని అలంకరించింది. దాన్ని చూస్తుంటే ప్రాణమిత్రుణ్ణి చూసినంత సంబరంగా వుంటుంది. ఇవాళ దానికేసిచూస్తుంటే కడుపులో చెయిపెట్టి దేవినట్లని పించింది. దాని పెద్దముల్లు విరిగి జారిపోయింది. ఆడటం మానేసి మూగగా వికృతంగా నిలబడి చూస్తోంది.

"ఇంత బాధ్యతగల పనికి నీలాంటి లంచగొండి పనికి రాడు. నిన్ను పనిలోంచి తీసేస్తున్నాను. ఇప్పుడు చేసిన నేరానికి నెలరోజులు కఠినశిక్ష వేస్తున్నాను" అని అధికారి అనటం విని కుప్పనకూలబడి ముఖం చేతులతో కప్పు కున్నాడు.

కొంతసేపటికిలేచి ప్రాణంలేని యంత్రంలాగా పోలీసు వెంట నడవసాగాడు. వెనక్కితిరిగి ఒక్కసారి గోడగడియారం కేసి చూచాడు. విరిగిన ముల్లూ; మాసిన ముఖమూ, పని

చెయ్యని పెండ్యులమ్...తననిచూసి జాలిపడుతోందా? తోటి గుమాస్తాలలాగా హేళనగా వెక్కిరిస్తోందా? ఏమో?

వీధిలోంచి ముష్టివాడు గొంతు ఎత్తి పాడుతున్న తత్వం "చేతిలో బెల్లము వున్నంత సేపే కాకి బలగమంతా, ఆ చేతిలో బెల్లము సరిపడకపోతే ఎవరురారు వెంటా"

చెవుల్లో గింగురు మంటుంటే పాతికేళ్ళు తన ప్రాణంతో పాటు ప్రేమించిన ఆఫీసు కుర్చీకి అశ్రువులతో వీడ్కోలుచెప్పి కదలి వెళ్ళాడు చిదంబరం. చీకటి బజారులో లక్షలు కొల్ల గొట్టినవ్యాపారి కారుదూసుక పోతోంది. జన్మంతా లంచాలు కొట్టినా, అధికారి కట్టిన అంతస్తులమేడ తనకేసి నిక్కి-చూస్తోంది. తను మటుకు సంకెళ్లు వేసుకుని నడుస్తున్నాడు. ప్రాణంలేని కళేబరంలాగా ఒక్కొక్క అడుగూ పాతాళంలోకి అణగారిపోతున్నట్లుగా వుంది.

---